
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 ఏప్రిల్ 2025




నమోదుకు హాజరైన వారు

నమస్తే సర్వే

- చెత్త ఏరుకునే వారి వివరాల నమోదు
- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా భీమవరం
- 77 మంది సర్వే పూర్తి

భీమవరంటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రోడ్లపై వ్యర్థాలను ఎరుకునేవారిని గుర్తించి వారికి మెరుగైన జీవన విధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్‌డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) పథకంలో నమోదు కార్యక్రమాన్ని భీమవరం మునిసిపాల్టీలో సోమవారం చేపట్టారు. గతంలో అధికారులు గుర్తించిన 126 మందికి సమాచారం అందించారు. 82 మంది హాజరుకాగా ఆధార్ కార్డులల్లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో 42 మంది వివరాలు నమోదు కాలేదు. 77 మంది వివరాలు నమోదు చేశారు. మరో రెండు రోజులు సర్వే కొనసాగుతుంది. సర్వేలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, సర్వే కోఆర్డినేటర్ వినయ్‌కుమార్, పర్యవేక్షకులు చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

- వ్యర్థాలను ఏరుకునేవారిని గుర్తించడంతోపాటు ఏకీకరణను నిర్ధారించేందుకు వృత్తిపరమైన ఫోటో గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు.
- వారికి భద్రత, శిక్షణ, నైపుణ్యం మెరుగదల, వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ కిట్స్) అందిస్తారు.
- ఈ-శ్రమ్‌లో నమోదు, ఆయుష్మాన్ భారత్ కింద వైద్య కవరేజీ నిర్ధారించే ఆరోగ్య బీమా అదించే చర్యలు తీసుకుంటారు.
- వ్యర్థాలను సేకరించే వాహనాలను కొనుగోలుకు అవసరమైన మూలధనం రాయితీ రూ.5లక్షల వరకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు.



కొల్లేరు కాంటూరు ఎందుకు కుదించకూడదు

- సీఈసీని నివేదిక కోరిన సుప్రీంకోర్టు
- కాంటూరు కుదిస్తే సుమారు 44 వేల ఎకరాలు ప్రజలకు..

కైకలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు సుప్రీంకోర్టు కాంటూరు కుదింపు అంశాన్ని పరిశీలించమనడంతో కొల్లేరువాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులు, ఇబ్బందులను సుప్రీంకోర్టుకు తెలిపేందుకు ఇంప్లిమెంటేషన్ పిటిషన్ వేసింది. ఈనెల 16న సుప్రీంకోర్టు కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులపై 12 వారాల్లో నివేదిక అందజేయాలని సీఈసీ (సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ)ని కోరింది.

కొల్లేరు సరస్సు 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాలు విస్తీర్ణం ఉండగా 3వ కాంటూరుకి ఎందుకు తగ్గించ కూడదంటూ సోమవారం సీఈసీని మరోసారి నివేదిక అడిగింది. కాంటూరు కుదింపు సాధ్యపడితే సుమారు 44 వేల ఎకరాల భూమి ప్రజలకు అందుతుంది. ఇప్పటి వరకు నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు 22 వేల ఎకరాలు తగ్గించాలని ఆలోచన చేస్తున్న తరుణంలో సుప్రీంకోర్టు కాంటూరును కుదించి రెట్టింపు భూములను ప్రజలకు అందించేలా సీఈసీని నివేదిక కోరింది. ఇప్పటివరకు అనేకమంది కొల్లేరు పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ పలుమార్లు సుప్రీం కోర్టులో కేసులు వేయగా ఇక్కడ ప్రజల బాధలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లిన వారు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజల జీవనోపాధి దినదిన గండంగా గడుస్తోంది. ఎప్పుడు కొల్లేరులో నుంచి ప్రజలను బయ టకు పొమ్మంటారో, ఉండమంటారో, పేదలకు భూములు ఇస్తారో లేదో తెలియక సతమతమవుతున్న ప్రజలకు తాజాగా సుప్రీం కోర్టు కాంటూరు కుదింపును తెర మీదకు తీసుకురావడం తీపి కబురే. ప్రజల తరపున ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. సుప్రీం సూచనలతో కాంటూరు కుదింపు అంశం సీఈసీ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సాధ్యసాధ్యాలను పరిశీలిస్తే ప్రజలకు 44 వేల ఎకరాల భూమి అందుతుంది. కొల్లేరు సరస్సు 33,138 ఎకరాలకు పరిమితమవుతుంది. ఈ విస్తీర్ణం సరస్సులో పర్యావరణం, పక్షుల మనుగడకు సరిపోతుందని గతంలోనే అనేక మంది పేర్కొన్నారు. అదే అంశం సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవడం కొల్లేరు ప్రజలు కల సాకారం కానుంది. ఇక్కడ పరిస్థితులను తెలుసుకునేందుకు సీఈసీ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించనుంది.

ముగ్గురు అంతర్ రాష్ట్ర
దొంగల అరెస్ట్
రూ.13.40 లక్షల విలువైన
మోటారు సైకిళ్లు స్వాధీనం 7

చూచిరాతలు
ఏయూ దూర విద్య సెమిస్టర్ పరీక్షల్లో
మాస్ కాపీయింగ్ !? 6

పెనుగొండ.. గ్రామీణ ప్రాంతాలకు వాణిజ్య రాజధాని అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పూర్వ వైభవం కోల్పోవడమే కాదు.. కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పెనుగొండ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. పవన్ చిన్నతనం మొగల్తూరులో గడిపారు. ఆయన తల్లిదండ్రుల స్వస్థలాలైన పెనుగొండ, మొగల్తూరు అభివృద్ధిపై పవన్ దృష్టి సారించారు. స్వయంగా తన పేషీ అధికారులకు ఆదేశాలిచ్చి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు గ్రామంలో అధికారులు సభ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతిపాదనలు సిద్ధం చేశారు.


పెనుగొండ వారపు సంతకు ప్రధాన రహదారి

పెనుగొండ దశ తిరిగేనా..?

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ
- సమస్యలు విన్నవించిన గ్రామస్తులు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

గ్రామాభివృద్ధి సభలో అధికారులకు ప్రజలు విన్నవించిన సమస్యల్లో కొన్ని..

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థం.
- ఎస్‌వీకేపీ కళాశాల జెడ్ వంతెన నిర్మాణం.
- సమస్యల్లో వారపు సంత.
- యల్లప్ప కాలువ అధ్వానం
- పూడిపోయిన నక్కల డ్రెయిన్.
- ప్రభుత్వాసుపత్రి అంతంత మాత్రం.
- శ్మశానికి స్థలం కేటాయించాలి.
- పెనుగొండ- మార్టేరు కాలువగట్టు రహదారి అభివృద్ధి చేయాలి.
- పెనుగొండను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలి.
- ఫ్లైవోవర్ మరమ్మతులు చేపట్టాలి.
- వాసవి పెనుగొండగా పేరు మార్చాలి.

బక్కచిక్కిన నక్కల డ్రెయిన్



పెనుగొండలో డంపింగ్ యార్డు లేదు. నక్కల డ్రెయిన్ గట్టుపై చెత్త డంప్ చేస్తున్నారు. చెత్త మేటతో కాలువ కుచించుకుపోయింది. నీటి పారుదల లేక వర్షాలు, వరదల సమయంలో చేలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుగొండ మీదుగా వెళ్లే యల్లప్ప కాలువలో ఇళ్లలో మురుగు వదులడంతో చేలకు ముప్పు వాటిల్లుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

పెనుగొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):పెనుగొండ పేరు చెబితే గుర్తిచ్చేది పశువుల సంత. జిల్లాలోనే ప్రసిద్ధి పొందిన సంతలో ఇతర జిల్లాల వారు కూడా అమ్మకాలు, కొనుగోలు చేసేవారు. హోల్ మార్కెట్‌లో పరిసర ప్రాంత వ్యాపారులు సరుకులు తీసుకెళ్లి వ్యాపారం సాగించేవారు. దాదాపు 20 గ్రామాల వారికి పెనుగొండ వారపు సంత ప్రధానం. అంతే కాదు ఇక్కడ ఇనుప పెట్టెల తయారీ మినీ పరిశ్రమగా వర్థిల్లింది. ప్రస్తుతం ఇదంతా గత వైభవంగా మిగిలింది. పాలకులు నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు స్వయంగా అభివృద్ధిపై దృష్టి సారించడంతో పూర్వ వైభవం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. గతనెల 27న ఉప ముఖ్యమంత్రి పేషీ అధికారులు గ్రామాభివృద్ధి సభ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

డ్రెయినేజీ అస్తవ్యస్తం

పెనుగొండలో సుమారు 40 వేల మంది జనాభా ఉన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో మురుగు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. డ్రెయినేజీ నీరు పంట కాలువ, నక్కల డ్రెయిన్‌లో చేరుతోంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ అధ్వానం

పెనుగొండలో సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన ఫ్లైఓవర్ అధ్వానంగా మారింది. వంతెనపై పైకి లేచిన ఊచలు, గోతులు ప్రయాణికులకు ప్రమాదకరంగా ఉన్నా యి. వంతెన ప్రారంభించిన ఏడాదికే మరమ్మతులకు గురైందని వాపోతున్నారు. మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పెనుగొండ - మార్టేరు కాలువ గట్టు రహదారి

పెనుగొండ - మార్టేరు కాలువగట్టు రహదారి అధ్వానంగా మారింది. పంట తరలించడానికి వీలు లేకుండా పోయిందని రైతులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కళాశాల విద్యార్థులకు మార్టేరు వైపు వెళ్లడానికి ఇది దగ్గరగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు జరిగితే ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, కాలుగట్టు రహదారి అభివృద్ధి చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

మరెన్నో సమస్యలు..

గ్రామంలో ప్రభుత్వాసుపత్రిలో పూర్తి స్థాయి సేవలందక తణుకు, లేదా పాలకొల్లు వెళ్లాల్సివస్తోంది. కార్డియాలజిస్టు, ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. పెనుగొండలో శ్మశాన వాటిక అభివృద్ధికి మూడు ఎకరాలు కేటాయించాలని ప్రజలు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో రహదారులకిరువైపులా మొక్కలు నాటి గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని కోరారు. వాసవి అమ్మవారు పుట్టిన ల్లుగా ప్రసిద్ధి చెందిన పెను గొండ గ్రామం పేరును వాసవి పెనుగొండగా మార్చాలని అధికారులకు విన్నవించారు.

సమస్యల పరిష్కారం దిశంగా అధికారులు రూపొందించిన ప్రతిపాదనల మేరకు డిప్యూటీ సీఎం పవన్ నిధుల మంజూరు చేస్తారని గ్రామస్తులు భావిస్తున్నారు. పెనుగొండకు మహర్దశ రానుందని ఆశతో ఉన్నారు.

వారపు సంత ఇరుకు



20 గ్రామాల జనం రద్దీతో ప్రతి బుధవారం ఉత్సవాన్ని తలపించే వారపు సంత ఇరుకైంది. ప్రతి ఇంటికి అవసరమైన నిత్యావసరాలు, కూరగాయలతో పాటు పశువుల బేరసారాలు సాగేవి. విశాలమైన ప్రాంతంలో జరిగే సంత కనుమరుగైంది. ఇరుకు ప్రాంతం లో కూరగాయల దుకాణాల నిర్వహణ కూడా కష్టంగా మారింది. చుట్టుపక్కల ఎక్కడ దొరకని సరుకులు పెనుగొండ సంతలో అందుబాటులో ఉండేవి. మార్కెట్‌కు అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

జడ్ వంతెన శిథిలం



ఎస్‌వీకేపీ కళాశాల నియోజకవర్గంలో అతి పెద్ద విద్యా సంస్థ. ప్రధాన కాలువకు అవతల ఉండడంతో విద్యార్థులు వంతెన పైనుంచి రాకపోకలు సాగించాలి. కొత్తగా ఏర్పడిన కాలనీ వాసులకు కూడా జడ్ వంతెన కీలకం. వంతెన శిథిలం కావడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన తిరిగి నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పల్లె పండుగ

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలకు కళ వచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనులు చేపట్టారు. జిల్లాలో దాదాపు రూ. 58 కోట్లతో సిమెంట్ రహదారులను నిర్మించారు. ప్రతి నియోజకవర్గానికి నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎమ్మెల్యేల చొరవతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి పనులు చేశారు. పూర్తయిన పనులకు ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. మరో రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలి. వీటి కోసం కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించినా పాత బకాయిల మాటేమిటని పలువురు కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల విడుదల
- జిల్లాలో రూ. 57 కోట్ల విలువైన పనులు
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు
- తాజా నిధులతో ఊరట లభిస్తుందని భరోసా

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఆ ప్రభావంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు. వారి నుంచి స్పందన అంతంతమాత్రం కావడంతో నియోజకవర్గ ఎమ్మెల్యేలు భరోసా ఇచ్చి పనులు చేయించారు. పనులు పూర్తయ్యాక బిల్లులు విడుదల కాకపోవడంతో కొత్త పనులు చేపట్టాలంటే వెనుకడుగు వేస్తున్నారు. ఈ తరుణంలో కేంద్రం నుంచి ఉపాధి నిధులు దాదాపు రూ.789 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించనున్నారు. అధికారులు సైతం కాంట్రాకర్లకు ఆదిశగా భరోసా కల్పిస్తున్నారు.

పాత బకాయిల ఊసేది..

గత తెలుగుదేశం ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనులు పూర్తి చేసిన వారికి వైసీపీ హయాంలో చుక్కలు చూపించారు. బిల్లులు మంజూరు చేయలేదు. నాణ్యతా ప్రమాణాల కమిటీ పేరుతో కాలయాపన చేశారు. కమిటీ నివేదిక ఇచ్చినా సరే బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు మెట్లు ఎక్కిన వారికి మాత్రమే వైసీపీ హయాంలో నిధులు మంజూరయ్యాయి. అది కూడా కోర్టు ధిక్కరణ కేసులు వేస్తే తప్ప ప్రభుత్వం స్పందించ లేదు. అయినా సరే 10శాతం బిల్లులను నిలిపివేసింది. నాణ్యత ప్రమాణాల కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత ఆ పది శాతం బిల్లులను మంజూరు చేస్తామని వైసీపీ ప్రభుత్వం స్పష్టం చేసినా బిల్లులు మంజూరు చేయలేదు. జిల్లాలో ఇలా దాదాపు రూ.30 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బకాయిల కోసం ఎదురుచూసిన కాంట్రాక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో పార్టీ సానుభూతిపరులు, నాయకులే పనులు నిర్వహించారు., వారంతా గత ఐదేళ్ల ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. కోర్టుల చుట్టూ తిరిగారు. తీరా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఊరట లభించ లేదు. ఇటీవల నీరు-చెట్టు బకాయిలను చెల్లించగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దానికోసం ఇప్పుడు అంతా ఎదురుచూస్తున్నారు. ఇటీవల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు సైతం బిల్లుల కోసం తిరుగుతున్నారు. తాజాగా నిధులు విడుదల కావడంతో బకాయిలు విడుదల కానున్నాయన్న భరోసా లభించింది.



రేపే పది పరీక్ష ఫలితాలు విడుదల

జిల్లాలో 22 వేల మంది విద్యార్థుల ఎదురుచూపు

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలు ఈ నెల 23న విడుదల కానున్నాయి. వీటి కోసం జిల్లాలో పరీక్షలు రాసిన 22 వేల మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయడానికి విద్యా శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 22,596 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 21,795 మంది హాజరయ్యారు. మరో 480 మంది ప్రైవేటుగా పరీక్ష రాశారు. పదో తరగతి పరీక్షలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మార్చిలో పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిసెట్, అగ్రిసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు కోచింగ్ సెంటర్ల బాట పట్టగా మరి కొంత మంది ఇంటర్ మొదటి సంవత్సర క్లాసులకు ముందస్తుగానే చేరుకున్నారు.

కాస్త ముందుగానే ఫలితాలు

గత ఏడాదితో పోలిస్తే పదో తరగతి ఫలితాలు ముందుగానే అందించనున్నారు. ఏప్రిల్ 1న పరీక్షలు ముగియడంతో 3 నుంచి 9 వరకూ మూల్యాంకనం నిర్వహించారు. వీరవాసరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం నిర్వహించారు.

ఉత్తీర్ణత పెరుగుతుందా..?

పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరగడానికి విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు నిచ్చి గతంకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. గత ఏడాది పదో తరగతిలో జిల్లాలో 81.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో ఉన్నారు. గతంలో ఉత్తీర్ణత, అధిక మార్కులు సాధించడంలో బాలికలే ముందున్నారు. బాలికలు 85 శాతం మంది ఉత్తీర్ణత సాధిస్తే బాలురు మాత్రం 78.9 శాతం మంది పాస్ అయ్యారు. ఈ ఏడాది 22వేల మంది పరీక్షలు రాయగా ఎంత శాతం ఉత్తీర్ణత నమోదవుతుందని ఉత్కంఠగా ఉన్నారు.

ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

పోలీస్ కార్యాలయంలో 23 అర్జీల స్వీకరణ

భీమవరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం నిర్వహించారు. అర్జీదారులతో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి విచారణ చేపట్టాలని, తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఏఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

237 అర్జీల స్వీకరణ : కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 237 అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులను విన్నవించిన సమస్యలలో కొన్ని..

- తమ కుమారుడికి ఎకరం పొలం రాసి ఇచ్చామని, అతడు హైదరాబాద్‌లో ఉంటూ తమను చూడడం లేదని తిరిగి ఆస్తి మాకు అప్పగింగి న్యాయం చేయాలని తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామానికి చెందిన పెరుమళ్ళ సత్యనారాయణ దంపతులు అర్జీని సమర్పించారు.
- ఆకివీడు మండలం సిద్ధాపురం, చిన్నమిల్లి గ్రామాల పరిధిలో జిరాయితీ పట్టా భూములు ఫిషర్‌మెన్ సొసైటీ భూములలో కేంద్ర ప్రభుత్వం పరిష్కారంలో ఎన్‌బీడబ్ల్యు ఎల్ ఆమోదం మేరకు తమ భూములు ఇప్పించాలని కోనాల ఏసు పాదం, కర్ర మోషే, ఉచ్చుల చెల్లయ్య కోరారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

- తన భూమి ఆక్రమణకు గురైందని, సర్వే చేయించి హద్దులు చూపాలని పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన బొక్క చంద్రావతి కోరారు.
- ఇరగవరం మండలం తూర్పు విప్పర్రులో కాలువ గట్టును ఆక్రమించుకుని ట్రాక్టర్లు వెళ్లకుండా, వ్యవసాయ పనులకు ఆటంకం కల్పిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని రైతులు ఎ.సూర్యనారాయణ, ఎ.లక్ష్మీనరసింహరావు కోరారు. రహదారికి తూములు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.
- పెంటపాడు మండలం పరిమెళ్లలో రహదారికి అక్రమంగా మురుగు తూములను పెట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని గ్రామానికి చెందిన చవ్వాకుల వెంకటలక్ష్మి కోరారు.

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







కలువ పూల సోయగం

దెందులూరు మండలం దోసపాడు మంచినీటి చెరువులో వికసించిన కలువ పూవులు చూపరుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తామర ఆకులతో పచ్చదనం అలుముకున్న చెరువుకి వికసించిన తామర పూలు మరింత అందాన్ని తెచ్చాయి.. ఈ రమణీయ దృశ్యాలను పలువురు చూసి ముగ్ధులవుతున్నారు..

-ఫొటోగ్రాఫర్, ఏలూరు



చైతన్య భారతి జాతీయస్థాయి నాటిక పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పరిషత్ సభ్యులు

24 నుంచి చైతన్య భారతి జాతీయస్థాయి నాటిక పోటీలు

4 రోజులు..10 నాటికల ప్రదర్శన

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26, 27 తేదీల్లో భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు.నాలుగు రోజుల పాటు జరిగే నాటిక పోటీలలో 10 నాటికలను ప్రదర్శించనున్నారు. చైతన్య భారతి 18వ జాతీయస్థాయి నాటిక పోటీల బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. 24వ తేదీన నాటక పోటీలను కేంద్ర సహాయక మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిలు ప్రారంభిస్తారన్నారు. ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ సీనీ, రంగస్థల నటుడు ఎస్కే మిశ్రా, ప్రముఖ రంగస్థల నటీమణి మణి బాలకు రంగస్థల చైతన్య పురస్కారాలు, రంగస్థల నటుడు బాలాజీ నాయక్, చవ్వాకుల సత్యనారాయణ, సినీ దర్శకుడు వివేక్ ఆత్రేయలకు ఆత్మీయ సత్కారం జరుగుతాయని వివరించారు. ముగింపు కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతున్నారన్నారు. సమావేశంలో పరిషత్ సభ్యులు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వరరావు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, బోండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, డాక్టర్ కత్రిడి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణవర్మ, పెన్నాడ శ్రీను, నడింపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలకు క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా అందించబోవు అత్యున్నత పద్మ పురస్కారాలకై 2026వ సంవత్సరానికి క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు www.padma awards.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు. ఈ వెబ్‌సైట్‌లో క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని వాటిని పీడీఎఫ్, వార్డ్ ఫార్మేట్‌లలో స్పోర్ట్షఇన్ ఏపీ జీమెయిల్.కామ్, ఇన్సెంటివ్స్.స్కీమ్స్ జీమెయిల్.కామ్‌లో మే 26 తేదీ సాయంత్రం 5 గంటలలోగా పంపాలని తెలిపారు. అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం సిఫారుసు చేస్తుందన్నారు. అంతర్జాతీయ క్రీడలలో ప్రతిభాపాటవాలను చూపుతున్న జిల్లా క్రీడాకారులు కేంద్ర ప్రభుత్వంచే తగిన గుర్తింపు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

సాంకేతికతతో పరిశోధనలు విస్తృతం

పెదపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతతో పరిశోధనలు విస్తృతం చేయాలని, బయో మెడికల్ సిగ్నల్స్, వాటిని ప్రాసెసింగ్ చేయడానికి ఆధునిక పరికరాలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ద్వారా భవిష్యత్తులో అతిచిన్న సైజులో మెడికల్ పరికరాలను డిజైన్ చేయవచ్చునని, నాన్ ఇన్‌వేజివ్ పద్ధతిలో చేయడానికి ప్రభుత్వ అనుమతి కూడా అవసరం లేదని ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్ డాక్టరు సుదేష్‌దాస్ గుప్త తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బయో మెడికల్ ఇంజనీరింగ్ మీద అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. జెఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టరు ఎన్. బాలాజీ, పాండిచ్చేరి టెక్నాలజీ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు ఆర్.సంతానలక్ష్మి, మను సెంట్రల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు ఎ.రవి, అన్నామలై విశ్వ విద్యాలయం నుంచి డాక్టరు వి.ఆర్.శర్మలు పాల్గొని బయో మెడికల్ ఇంజనీరింగ్‌పై వివరించారు. సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టరు ప్రసాద్ మాట్లాడుతూ బయో మెడికల్ అద్భుతమైన అంశమని, ప్రస్తుత ఆధునిక కాలంలో సాంకేతికతతో అరికట్టలేని వ్యాధి లేదన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఈసీఈ హెచ్‌వోడీ తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌లోనూ అవస్థలు

ఒక్కసారిగా తగ్గిన రిజిస్ట్రేషన్‌లు

సిబ్బందికి అంతంత మాత్రమే అవగాహన

కక్షిదారుల్లో అసహనం



ఆచంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి రోజూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది.అటువంటి ఆదాయం వచ్చే శాఖపై ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువస్తుండటంతో అటు అధికారులకు, ఇటు కక్షిదారులకు ఇబ్బందులు తరచూ తలెత్తుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తరచూ కొత్త విధానాలు తీసుకు రావడంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరగడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అమ్మకం, కొనుగోలు దారులు కూడా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 2.0 కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. మొదట్లో అనేక మంది ఈ విధానం వ్యతిరేకించినప్పటికి ప్రస్తుతం ఈ విధానానికి అలవాటుపడి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇటీవల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంపై కక్షిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానంపై కనీసం సిబ్బందికే పూర్తి అవగాహన లేనపుడు కక్షిదారులకు ఇంకెలా అర్థమవుతుందని విమర్శలు వినపడుతున్నాయి. సరిగ్గా స్లాట్ బుకింగ్ సమయానికి కక్షిదారులు కార్యాలయంలో ఉండాల్సి ఉంటుంది. అయితే ఒక్కోసారి సర్వర్ సమస్య వచ్చినపుడు కూడా స్లాట్‌బుక్కింగ్ చేసినప్పటికి ఉపయోగం ఉండదు. ఈ స్లాట్ బుక్కింగ్ వల్ల గంటకు కేవలం ఆరు దస్తావేజులు మాత్రమే అవుతాయి. ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చినపుడు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందితో కక్షిదారులకు అవగాహన కల్పిస్తే కొంత వరకు ఫలితం వస్తుందని కొంతమంది అంటున్నారు. స్లాట్ బుక్కింగ్ విధానం అమలులోకి రావడంతో సోమవారం జిల్లావ్యాప్తంగా పది హేను కార్యాలయాలకు సంబంధించి సుమారు 150 రిజిస్ట్రేషన్‌లు మించి అవనట్లు సమాచారం. మామూలు రోజుల్లో సోమవారం అయితే జిల్లా వ్యాప్తంగా సుమారు 500లకు పైగానే రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. ఈ విధానంతో ఒక్కసారిగా ఆయా కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఈ స్లాట్ బుకింగ్ విధానంపై అధికారులు పునరాలోచించాలని లేకపోతే అన్ని కార్యాలయాల్లో కూడా సిబ్బందితో అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



భూమాతా.. మన్నించు !

భూమికి పొంచి ఉన్న ముప్పు

రొయ్యల సాగుతో తగ్గుతున్న భూసారం

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలెన్నో

2050 నాటికి కొన్ని రకాల పంటలే

2040 నాటికి ప్లాస్టిక్ ఉత్పత్తులు 60 శాతానికి తగ్గాలి

నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం



పాలకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మానవ సమాజం ఎటువైపు పోతున్నదీ ఒకవైపు రాజకీయ కక్షలు కార్పణ్యాలు ఒకవైపు కులాల మతాల కీచులాటలు..ఇవి చాలవన్నట్లు జనంలో నానాటికీ పెరుగుపోతున్న వ్యక్తిగత స్వార్థం.. వెరసి మనిషన్నవాడు పర్యావరణం అనే పదాన్ని పూర్తిగా మరిచిపోయే పరిస్థితి వచ్చేసింది. ఒకవైపు భూతాపాన్ని పెంచేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు... మరోవైపు భూసారాన్ని తగ్గించేస్తున్న రసాయన వ్యర్థాలు, మానవ తప్పిదాలతో నానాటికి క్షీణించిపోతున్న వృక్ష సంపద భూమి ఉనికిని ప్రశ్నించే స్థాయికి వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 40 శాతం భూమి కాలుష్య కోరల్లోకి వెళ్లిపోయింది. సంపద సృష్టి క్రమంలో రైతులు హరిత వనాలను వదిలి నీలి విప్లవం వైపు పరుగు తీయడంతో భూమికి ప్రమాదం ఏర్పడింది. ఇటీవల పలువురు శాస్త్రవేత్తలు పశ్చిమ గోదావరిలో భూసారంపై ఆందోళనకర మైన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జిల్లాలో తగ్గుతున్న ఉద్యాన వనాలు పెరుగుతున్న రొయ్యల చెర్వులు కారణంగా భవిష్యత్తు రోజులలో జిల్లాలో తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడటం ఆందోళన కల్గించే అంశం.నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

ధరిత్రిని కాపాడడం ఎలా

ఇటీవల కాలంలో మొక్కలు నాటడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అమలు చేయడం కొంతమేరకు భూమికి మేలు చేస్తుంది. మొక్కల నాటడం ద్వారా పర్యావరణానికి మేలు కలగటమే కాకుండా భూసారం పెరుగుతుంది. ఇటీవల వ్యవసాయ ఉత్పత్తులు పెంచుకోవడానికి రైతులు అధికంగా రసాయన ఎరు వులు వినియోగిస్తున్నారు. రసాయన ఎరు వులతో తాత్కాలిక వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినప్పటికీ దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోతుంది. భూసారం పెంచడానికి సేంద్రీయ ఎరు వులు వాడాలి. పంటలను క్రిమి కీటకాల నుంచి కాపాడటానికి ప్రమాదకరమైన క్రిమి సంహారక మందులను మాని ప్రకృతి సిద్ధ తైలాలు వాడాలి. ఇటీవల ప్రమాదకర క్రిమి సంహారక మందులు వినియోగంతో భూమి పైపొరల్లో జీవించే వానపాములు, పీతలు, నత్తలు, తాబేళ్లు, ఇతర జీవరాశులు పెద్ద సంఖ్యలో క్షీణించి పోయాయి. కొన్ని అయితే కనుమరుగయ్యాయి. దీంతో భూసారం గణనీయంగా తగ్గుతున్నది. ధరిత్రిని కాపాడటానికి ప్రపంచ వ్యాప్తంగా మానవ కార్యాకలాపాలు మెరుగుపర్చడం ద్వారానే సాధ్యమవుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. అధికారంలో ఉన్న వారికి భూగ్రహంపై ప్రేమను చాటుకునేందుకు ఎర్త్‌డే ఒకటే అవకాశం.

ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలి

మానవ జీవితంతో పెనవేసుకుపోయిన ప్లాస్టిక్‌ను నూరు శాతం నిషేదించడం కష్టమే . అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవకుండా రీసైక్లింగ్ యూనిట్లును నెలకొల్పాలి. కొంతమేర భూమిలో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కచ్చా రోడ్ల మెరుగుపరచడానికి వినియోగించాలి. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి ప్రజలకు వివరించాలి. ఇలాంటి చర్యలు చేపట్టడం ద్వారా ధరిత్రికి తద్వారా మానవాళికి మేలు జరుగుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్య సాగు చేస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు భూసారాన్ని పరీక్ష చేయాలి. సేంద్రీయ ఎరువులతో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి. హరిత వనాలు విరాజిల్లుతుంటేనే ప్రకృతి, పర్యావరణం సంరక్షించబడుతుంది. రైతులు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనలు మేరకే రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉపయోగించాలి. ఈచర్యలు చేపడితే భూతాపం నుంచి బయట పడటమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుంది.

తొలిసారిగా 1970 ఏప్రిల్ 22వ తేదీన ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ పర్యావరణ వేత్త గేలార్డ్ నెల్సన్, హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో గ్రాడ్యుయేట్ విద్యార్థి డెనిస్ హేస్ కలిసి 1070లో దీనిని ప్రారంభించారు. 1990 నాటికి ఎర్త్‌డే నిర్వాహణ ప్రపంచవ్యాప్తం అయ్యింది. ఇప్పుడు ఏటా దాదాపు 200 దేశాలలో కోటి మందికి పైగా ఎర్త్‌డే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మానవ తప్పిదాలు కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నానాటికి పెరుతున్నాయి. అదేసమయంలో మొక్కలు నాటడం తగ్గి వృక్ష సంపద తగ్గుతుంది. 2040 నాటికల్లా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని 50 దేశాలు నడుం బిగించాయి. ఇదే సమయంలో ప్లాస్టిక్ వినియోగం సైతం 60 శాతానికి తగ్గించాలని అభివృద్ధి చెందిన దేశాలు నిర్ణయించాయి.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత. నేడు గ్రామాల్లో సైతం చెట్లను విచక్షణా రహితంగా కొటివేస్తున్నారు. పొలాలను తీసేసి అపార్టు మెంట్‌లు కడుతున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో తీవ్రమైన ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. వచ్చేతరం ఆక్సిజన్ కొనుగోలు చేసి జీవించాల్సిన దుస్థితి వస్తుంది. భూమిలో ఉండే నీటిని చెట్లు, మొక్కలు పీల్చు కుంటాయి. వీటిని పూర్తిగా తొలగించడం వల్ల భూమిలో నీరు ఎటూ వెళ్లే మార్గం లేక భవిష్యత్‌లో వరదల తీవ్రత కూడా పెరిగే అవ కాశం ఉంది.

ఆరేపల్లి నాగ సుధీర్‌బాబు,బోటనీ అధ్యాపకుడు, డీఆర్‌జీ కళాశాల పెంటపాడు

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు



ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమి సారం కోల్పోతోంది. దీనికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై రైతులను మల్లించేలా చేస్తుంది. దీంతో భూమిలో పోషక విలువలు పెరగడం ద్వారా రాబోయే తరాలకు సారవంత మైన నేలను అందించేందుకు వీలుంటుంది. నేడు అధిక దిగుబడుల కోసం రైతులు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమిలో పోషక విలువలు పోయి చౌడు నేలలుగా మారే ప్రమాదం ఉంది. ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించడంపై దృష్టి సారించాలి.

ఆర్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

చూచిరాతలు



ఏయూ దూరవిద్య సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ !?

సొమ్ములు చెల్లిస్తే ఇంటికే జవాబు పత్రాలట !

పరీక్షల్లో ప్రతిభకు పాతరేనంటూ అభ్యర్థుల ఆవేదన

యూనివర్సిటీ వీసీ దృష్టి సారిస్తేనే దిద్దుబాటు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మరో ఏడాదికాలంలో శతవసంతాల చరిత్రను లిఖించనున్న ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వ విద్యాలయంపై తాజాగా జరుగుతోన్న దూర విద్య డిగ్రీ, పీజీ మెదటి సెమిస్టర్ పరీక్షల్లో జరుగు తోన్న మూకుమ్మడి చూచిరాతల ఆరోపణలతో మచ్చపడనుందా ? యూనివర్సిటీ పరిధికి భౌతికంగా దూరంగా వున్న ఏలూరు జిల్లాలో సెమిస్టర్ పరీక్షలను కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు అతి దగ్గరగా అంటే కనీసదూరం కూడా పాటించకుండానే పక్కపక్కనే కూర్చుని మాస్ కాపీయింగ్‌తో పరీక్షల్లో పారదర్శకతకు మంగళం పాడేస్తున్నారా ? ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకుల సహకారం లేకుండానే ఈ తతంగం జరుగుతుండటం సాధ్యమేనా ? ప్రశ్నలకు జవాబుపత్రాల జిరాక్స్ కాపీలను చూస్తూ రాస్తుంటే నిరోధించాల్సిన యూనివర్సిటీ స్క్వాడ్ బృందాలు ఏం చేస్తున్నాయి ? ఈ వరుస ప్రశ్నలు, సందేహాలు, ఆరోపణలకు సోమవారం నుంచి ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ డిస్టెన్స్ విభాగం యూజీ, పీజీ పరీక్షలు జరుగుతున్న తీరే నిదర్శనమని ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా ఈ నెల 24వరకు జరుగనున్నాయి. ఉదయం 9 గంటలనుంచి 12 గంటలవరకు పీజీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెమిస్టర్ పరీక్షలు జరుగు తున్నాయి. జిల్లాలో 4 ప్రాంతాల్లో ఈ పరీక్షలకు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కేంద్రంలో ఆయా కోర్సులకు 40నుంచి 100 మందివరకు పరీక్షార్థులుంటారు. ఒక్కో పేపరు 70 మార్కు లకు పరీక్ష ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా దూర విద్య విధానంలో డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వీటిలో కొన్ని కేంద్రాల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న తీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్ష సమయం మొదలుకుని అభ్యర్థుల సిట్టింగ్, బుక్‌లెట్ల అందజేత, జవాబుపత్రాల జిరాక్స్ కాపీల పంపిణీ..ఇలా అన్ని సందర్భాల్లో అవకతవకల మయంగా తయారైందని సమాచారం.

ఒక్కో పేపరుకు రూ.2500 చెల్లించినవారికే..

యూనివర్సిటీకి నిర్ణీత ఫీజులుచెల్లించి పరీక్షలకు హాజరైన ఆయా ప్రాంతాల పరీక్షార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతోన్న కొన్ని కేంద్రాల నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ ప్రకారం ఒక్కో పేపరుకు రూ.2500 'చూచిరాతల ఫీజు' గా చెల్లించినవారికి పరీక్ష రాసేందుకు తొలి ప్రాధాన్యత, కేంద్రంలోకి ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా డిమాండ్ చేసిన ఫీజుచెల్లించకపోతే పరీక్షగదిలోకి ప్రవేశం లేదు సరికదా, గదుల్లో బల్లలపై అభ్యర్థులకు యూనివర్సిటీ కేటాయించిన నంబర్లుకూడా కనబడకుండా అయోమయం సృష్టిస్తున్నారని కొందరు వాపోతున్నారు. పరీక్ష ప్రారంభ సమయమైనా గదుల్లోకి వెళ్లనీయకుండా ఆరుబయటే నిలబెడుతున్నారని, ఆ మాత్రం డబ్బులు ఇవ్వలేనివారు పరీక్షకు ఎందుకు హాజరవుతున్నారని కొందరు నిర్వాహకులు నిలదీస్తుండగా, మరికొందరైతే దూరవిద్య పరీక్షల 'కల్చర్'ను పాడు చేయవద్దని పరీక్షలు జరిగేతీరుపై హితభోద చేస్తున్నారని సమాచారం. డబ్బులు ఇవ్వని అభ్యర్థులకు బుక్‌లెట్లు పరీక్షసమయం ముగిసే సమయానికి గంటలోపు ఇవ్వడం, కేంద్రంలో బహుళ అంతస్తుల్లోని గదులకు తిప్పించడం వంటి విపరీత పోకడలకు ఒడిగడుతున్నారని తెలుస్తోంది. ఇంకొందరైతే జవాబులను రాసే బుక్‌లెట్లను అభ్యర్థుల ఇంటికే ముందుగా తీసుకెళ్లి, ఎంచక్కా తీరిగ్గా జవాబులను ఇంటివద్ద రాసుకుని పరీక్ష ముగిసిన తర్వాత ఎవరూ చూడకుండా వాటిని ఆయా కేంద్రాల్లో తిరిగి అందజేయడం ద్వారా బండిళ్లలో కలిపి 'పాస్ గ్యారెంటీ' స్కీంను అదనపు చెల్లింపులపై అమలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇచ్చిన విద్యార్థులను గుర్తించేందుకు వీలుగా హాల్‌టిక్కెట్ల వెనుకభాగంలో ముద్రలు వేస్తున్నట్లు సమాచారం.

సిట్టింగ్ స్క్వాడ్‌లతో నిరంతర నిఘా ఉంటేనే..

దూరవిద్య పరీక్షలనగానే డబ్బులిచ్చిన వారికి దొడ్డిదోవలో పరీక్షల్లో సులువుగా ఉత్తీర్ణత సాధించవచ్చునన్న అపవాదు ఉంది. తాజాగా జరుగుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య యూజీ, పీజీ సెమిస్టర్ పరీక్షల్లోనూ అదే తంతు జరుగుతోంది. పరీక్షల్లో అవకతవకలు జరుగ కుండా నిరోధించేందుకు స్క్వాడ్ బృందాలను యూనివర్సిటీ నియమించడం పరిపాటి. దీనికిభిన్నంగా కొంతకాలంగా స్క్వాడ్ బృందాల జాడ పరీక్షల్లో కనబడటం లేదని పలువురు వాపోతున్నారు. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు వున్నా వాటికి గంతలు కట్టేయడమో లేదా మూకుమ్మడి చూచిరాతల దృశ్యాలు కనబడకుండా కెమెరాల డైరెక్షన్‌ను మార్చేయడమో జరుగుతోందని తెలుస్తోంది. దూరవిద్య పరీక్షల్లో అడ్డగోలు విధానాలు బహిర్గతమవుతున్నా వాటిని యూనివర్సిటీ ఉప కులపతి దృష్టిలో పడకుండా విశ్వ విద్యాలయ వర్గాలే అడ్డుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. తాజాగా జరుగుతున్న దూరవిద్య సెమిస్టర్ పరీక్షల్లో కొన్ని సెంటర్ల అక్రమాలను నిరోధించేందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నేరుగా రంగంలోకి దిగితే తప్ప ఇతరులెవరికీ సాధ్యమయ్యే పనికాదని చెబుతున్నారు.



కూల్.. కూల్.. తాటి ముంజులు

వేసవి తాపం తగ్గించే ఔషధం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే ఎండ తీవ్రత తట్టుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిలో తాటి ముంజలు ఒకటి. తాటి ముంజలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. వీటిలో ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పోటాషియం ఉంటాయి. గుండె ఆరోగ్యానికి మంచిది .. మలబద్ధకం నివారిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. అధికంగా నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గిస్తుంది. చికెన్ ఫాక్స్ (పొంగు) వంటి సీజనల్ వ్యాధులకు గురై బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తుంది ... చెడు కోలెస్ట్రాల్ తగ్గిస్తుంది. ఆకలిని అరి కడుతుంది. ఎండ వేడిమి వల్ల తలిగే తాపాన్ని నివారిస్తుంది. తాటి ముంజులు చౌకగా లభించడంతో సామాన్యులకు అందుబాటులో ఉంటాయి. పాలకొల్లు బస్టాండ్ రోడ్డులో తంగెళ్ళ రమేష్ తమ గ్రామం నుంచి రోజూ ముంజకాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. డజను రూ. 60లకు విక్రయిస్తున్నట్టు తెలిపాడు. రోజుకురూ. 1500 వరకూ ఆదాయం వస్తోందని, మున్సిపల్ పన్ను రూ.100 , ఖర్చులు పోను రూ800 వరకు మిగులు తోందని చెప్పాడు. వేసవి సీజన్ అయిన తరువాత కొబ్బరి దింపు, కాయలు వలుపు చేస్తూంటానని చెబుతున్నాడు.



పాలకొల్లు బస్టాండ్ సమీపంలో విక్రయాలు


మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు

కాల్వలకు ఈ నెల 25 వరకు నీటి సరఫరా

ఉపాధి పనిదినాలు మరింత పెంచాలి

జిల్లా అధికారుల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, వేసవి, వర్షాకాలం అవసరాలకు ఇసుకను సిద్ధం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ప్రతీ స్టాక్ పాయింట్ల వద్ద లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంచాలని సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రి కొలుసు పార్థసారధి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలతో పలు అభివృద్ధి అంశాలపై సోమవారం రాత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. ప్రస్తుత వేసవిలో నిర్మాణ పనులకు అనుకూలమని, జిల్లాలో పేదల ఇళ్లకు ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, మరమతులు అవసరమైన చోట్ల బోర్లు వేసి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి చెరువులకు పూర్తి స్థాయిలో నీరు నింపుకునేందుకు ఈ నెల 25వ తేదీవరకు కాల్వలు నీటి విడుదల చేస్తామని, ఆ తర్వాత కట్టేస్తారని మంత్రి చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కోటి 20 లక్షలు పనిదినాలు లక్ష్యంగా కాగా ఇంతవరకు కోటి 60 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు వేతనాలను వారంలోగా అందేలా చూడాలని కోరారు. జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పా టుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు, వ్యక్తిగత నిర్మాణాలు పునాదులు పూడిక అవసరాలను మట్టిని తీసుకునేందుకు అనుమతించాలన్నారు. జాతీయ ఉపాధిలో మామిడి రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలవరం కుడి కాల్వ ప్రధాన కాలువ ద్వారా మీర్జాపుం, సగ్గూరు, కొమ్మూరు రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన మైనర్ ఇరిగేషన్ చెరువు పనులకు త్వరిత గతిన చేపట్టాలన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 2019లో గ్రామంలో నిర్మించిన గ్రామసమాఖ్య భవనాల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపు జరిపేలా చూడాలన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ పేదల ఇళ్లకు పునాదుల పూడిక అవసరాలకు మట్టిని తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే వత్సవాయి ధర్మరాజు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయండి

కూటమిలో విబేధాలు లేకుండా ఐకమత్యంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మూడు రోజుల జిల్లా పర్యటనకు సోమవారం ఏలూరు గిరిజన భవన్‌లో ఆయనకు నాయకులు, ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అక్కడే జిల్లాలోని నాయకులు, ఎమ్మెల్యేలతో నాదెండ్ల సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కింద స్థాయికి చేరువగా తీసుకెళ్లడంలో అందరూ సమిష్టిగా కలిసి పని చేయాలన్నారు. ప్రభుత్వానికి చేటు లేకుండా ఐక్యంగా ప్రజలకు చేరువకావాలన్నదే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని నాదెండ్ల కోరారు.

మానవత్వం చాటిన మంత్రి

జిల్లా పర్యటనలో భాగంగా విజయవాడ నుంచి వస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ మానవత్వం చాటుకున్నారు.ఏలూరు సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులను చూసి వెంటనే తన వాహనాన్ని ఆపి గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందజేశారు. అంబులెన్స్ ఏర్పాటు చేయించి వారిని ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

బదిలీ టీచర్లకు మెడికల్ చెకప్ క్యాంపు తేదీలు ఖరారు

ఏకకాలంలో సదరం క్యాంపుతో రద్దీ సమస్యలకు ఆస్కారం ?

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సాధారణ బదిలీల ప్రక్రియలోభాగంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లను పొందేందుకు ఉమ్మడి జిల్లాలోని సంబంధిత కేటగిరీల హెచ్‌ఎంలు, టీచర్లకు మెడికల్ చెకప్ క్యాంపును ఈ నెల 24 నుంచి 26 వరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్య నిపుణులతో పరిశీలన చేయించుకుని కొత్తగా మెడికల్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పొందాలని సూచించారు.

అవే తేదీల్లో సదరం మెడికల్ క్యాంపు

ఉమ్మడి జిల్లాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లతో కూడిన మెడికల్ సర్టిఫికెట్లు వున్న సుమారు 400 మంది హెచ్‌ఎంలు, టీచర్ల జాబితాలను ప్రభుత్వాసుపత్రి వైద్య వర్గాలకు జిల్లా విద్యాశాఖ ఇప్పటికే అందజేసింది. దీనికనుగుణంగా వైద్యనిపుణులు సమగ్ర పరిశీలన చేసి కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లను ఇవ్వాల్సి ఉంది. వైద్యుల పరిశీలనలో ఏవైనా అభ్యంతరాలను లేవనెత్తితే వారిని రాష్ట్ర ఆసుపత్రి (హైయర్ సెంటర్) వైద్యనిపుణుల బృందం పరిశీలనకు పంపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. మరోవైపు ఉపాధ్యాయులకు నిర్వహించనున్న మెడికల్ చెకప్ క్యాంపు తేదీల్లోనే దివ్యాంగులకు జారీచేసే సదరం సర్టిఫికెట్ల మెడికల్ క్యాంపును కూడా నిర్వహించనుండటం.. ఆసుపత్రిలో ఇప్పటికే వైద్యుల కొరతతో ఎదురవుతున్న సమస్యలు ఆయా రోజుల్లో మరింత జటిలమయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి. సంబంధిత తేదీల్లో రోజువారీ వైద్యసేవల కోసం ఆసుపత్రికి విచ్చేసే ఓపీ విభాగం రోగులకు సైతం ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

పశ్చిమ, ఏలూరులకు డీఎల్‌డీవోలు

ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ వ్యవస్థల్లో సంస్కరణల్లో భాగంగా పశ్చిమ, ఏలూరు జిల్లాలకు ఇద్దరు ఎంపీడీవోలను డీఎల్‌డీవోలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లను ఇస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపురం డీఎల్‌డీవోగా జి.రాణి, ఏలూరు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా ఎన్.భోజీలను నియమించారు.

1035..డీఎస్సీ పోస్టులు

ఉపాధ్యాయ నియామకాలు ఇలా

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ/స్థానిక సంస్థల పాఠశాలల్లో 837 టీచరు పోస్టులు, మున్సిపల్ యాజమాన్యంలో 153, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం పాఠశాలల్లో 45 పోస్టులను కలిపి మొత్తం 1035 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు మే 15 లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు జరుగు తాయన్నారు. డీఎస్సీకి సంబంధించిన జీవోలు, పోస్టుల వివరాలు, పరీక్ష షెడ్యూలు, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్‌డెస్క్ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ cse.ap.gov.inలో అందుబాటులో ఉంచామన్నారు.

స్కూల్ అసిస్టెంట్

సబ్జెక్టు	ప్రభుత్వ/స్థానిక సంస్థలు	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
తెలుగు	35	3	2	40
హిందీ	58	2	1	61
ఇంగ్లీషు	79	4	1	79
గణితం	37	2	1	40
ఫిజికల్ సైన్సు	38	2	0	40
బయోలాజికల్ సైన్సు	58	5	1	64
సోషల్‌స్టడీస్	91	9	3	103
ఫిజికల్ ఎడ్యుకేషన్	179	2	0	181
సంస్కృతం	2	0	0	2
ఎస్జీటీ				
తెలుగు మీడియం	260	121	36	417
ఉర్దూ మీడియం	0	3	0	3
మొత్తం	**837**	**153**	**45**	**1035**

అభ్యర్థుల్లో ఆనందం

మెగా డీఎస్సీపై నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఎంతోకాలం నుంచి ఎదురు చూస్తున్నామని ఇప్పటికి తమ కల నెరవేర్చుకునే అవకాశం వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు..

నిరుద్యోగులకు అవకాశం



గత ప్రభుత్వంలో ఎక్కడా కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఎంతోమంది నాలాంటి నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ రూపంలో అవకాశం కల్పించింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్‌లో శిక్షణ పొందుతున్నాను.

గుడాల జ్యోతి, సగం చెరువు, పోడూరు మండలం

ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం



ప్రభుత్వం మెగా డీఎస్సీ షెడ్యూలు విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను బీఎస్సీ బీఈడీ చేశాను. ఇటీవల జరిగిన టెట్ ఎగ్జామ్ రాసి క్వాలిఫై అయ్యాను. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. మొదటిసారి ఈ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాను. ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం.

బర్రె ప్రియాంక, ఆచంట

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు



డీఎస్సీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాం. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించిన మహానుభావుడు చంద్రబాబు. గత ప్రభుత్వ తీరుతో విసిగిపోయి నిరాశ చెందాం. ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది.

జ్యోతి, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. 2008 తరువాత మెగా డిఎస్సీ విడుదల కాలేదు.ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాము. ఈసారి తప్పని సరిగా ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో ఉన్నాను. డీఎస్సీ పరీక్షకు కాస్త సమయం ఇస్తే బావుంటుంది.

బండి ప్రశాంతి, జంగారెడ్డిగూడెం

(పాలకొల్లు రూరల్/ ఆచంట/ కాళ్ళ/జంగారెడ్డిగూడెం)

ఉలికి పాటు



రూ.500 నకిలీ నోట్లు చెలామణి

కేంద్ర హోంశాఖ హెచ్చరికతో జిల్లా వ్యాపారుల్లో ఆందోళన

నరసాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో రూ.500 నకిలీ నోట్లు చెలామణి అవుతున్నాయంటూ కేంద్ర హోంశాఖ సోమవారం చేసిన ప్రకటన జిల్లావాసుల్ని ఉలికిపాటుకు గురిచేసింది. తొమ్మిదేళ్ల నుంచి ప్రజలు స్వేచ్ఛగా నోట్లు చెలామణి చేస్తున్నారు. అడపదడపా దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినా వాటి ఇట్టే పట్టేసేవారు. అయితే అసలు నోటుకు దీటుగా నకిలీ నోట్లు ఉన్నాయంటూ కేంద్రం ప్రకటనతో వ్యాపారులంతా అప్రమత్తమయ్యారు. నోట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే కస్టమర్ల నుంచి తీసుకుంటున్నారు. నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. ఈనోట్లు ఎక్కడ నుంచి వచ్చాయన్న దానిపై ఆరా తీస్తున్నాయి. 2016లో కేంద్రం రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసింది. మళ్లీ రూ.1000 నోటును విడుదల చేయలేదు. ప్రస్తుతం దేశంలో రూ 500 పెద్ద నోటు.ఈ నోటు తయారీలో కేంద్రం చాలా జాగ్రత్తలు పాటించింది. ఈ కారణంగా దొంగ నోట్ల చెలామణి తగ్గింది.గతంలో నరసాపురం, టీపీగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో దొంగ నోట్ల ముఠాను పట్టుకున్నారు. నోట్ల రద్దుకు ముందు జిల్లాలో దొంగ నోట్ల చెలామణి ఎక్కువగా జరిగేది. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా జిల్లాలోకి నోట్లు సరఫరా జరిగేది. అసలకు దీటుగా ఈ నోటు ఉండటంతో చాలామంది వీటిని సులభంగా మార్చి కోట్లకు పడగలెత్తారు. ప్రస్తుతం చెలా మణిలో ఉన్న నోటులో ఒక లోపాన్ని ఆర్‌బీఐ గుర్తించింది. అసలు నోటులో రిజ్వర్‌బ్యాంకు అనే ఇంగ్లీషు పదంలో ఆర్ పక్కన ఉండాల్సిన ఈకి బదులు ఏ ఉందని గుర్తించింది. ప్రజలు వీటిని గమనించాలని సూచించింది.



నేత్రపర్వం..ధ్వజారోహణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ భక్తులకు నేత్రపర్వమైంది. సాయంత్రం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు అంకురార్పణ, వాస్తుహోమాలను నిర్వహించారు. అతరువాత ధ్వజపటంపై గరుత్మంతుని చిత్రపటం వేసి గరుడ ప్రతిష్ఠ జరిపారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ సర్వాది దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద ఎగురవేశారు.


క్యూఆర్ కోడ్ గురించి వివరిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల విభాగం ప్రారంభం

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల విభాగాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో మొట్ట మొదటిసారిగా భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి, మహిళలపై దాడులు, ర్యాగింగ్, పలు వాటిపై ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కొన్ని ప్రశ్నలు వస్తాయని, ఆ ప్రశ్నలకు జవాబు ఇస్తే నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందుతుందన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందగానే సంబంధిత జిల్లా ఎస్పీకి ఫిర్యాదు వివరాలు రావడం జరుగుతుందని, వెంటనే సంబంధిత స్టేషన్‌కు వివరాలను పంపించి నేరాలను అరికట్టడం జరుగుతుందన్నారు. ఇదంతా ఆర్‌టీజీఎస్ సిస్టమ్ ద్వారా వివరాలు నమోదు అవుతాయని తెలిపారు. జిల్లాలో ఉన్న 25 స్టేషన్లలో ఈ క్యూఆర్ కోడ్ సోమవారం నుంచి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ ఆర్‌జీ. జయసూర్య, టూటౌన్ సీఐ కాళీచరణ్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేపల మేత దొంగల అరెస్టు

ఉంగుటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం రాచూరు, చుట్టుపక్కల గ్రామాల చేపల చెరువుల వద్ద నిల్వ ఉంచిన మేత బస్తాలను దొంగిలించిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు. వీరిని అరెస్టు చేసి సోమవారం నాడు తాడేపల్లిగూడెం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. రైతు నడింపల్లి రామాంజనేయ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరిపి సీతారాంపురానికి చెందిన బైరపూడి హరికృష్ణ, వనపర్తి సహదేవుడు, తాడేపల్లి వెంకట కుమార్, జుత్తుక ధనుష్, జుత్తుగ పవన్ కుమార్, నగివేరి జయరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాదాపు ఏడాదిగా వీరు మేతబస్తాల చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిపారు.

జాతీయ రహదారిపై రెండు మోటారు సైకిళ్లు ఢీ



క్షతగాత్రులు తండ్రికుమార్తె క్రీస్తురాజు, సింధు

» తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలు » రెండు కాళ్లు విరిగిపోయిన తండ్రి..తన కుమార్తెను కాపాడాలంటూ దండాలు

» కాల్ చేసినా కానరాని 108 అంబులెన్సు » మోటారు సైకిల్‌పై కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లిన కూలీలు

» ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చింతమనేని - ప్రైవేటు అంబులెన్సు ఏర్పాటు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో తండ్రి, కుమార్తె ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దెందులూరుకు చెందిన నేరెళ్ళ క్రీస్తురాజు తన కుమార్తె సింధు (14) వట్లూరు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి కుమార్తెను గురుకుల పాఠశాలకు క్రీస్తురాజు తన మోటారు సైకిల్‌పై తీసుకువెళ్తుండగా 16వ నంబరు జాతీయ రహదారి మార్గమధ్యలో వంగూరు బ్రిడ్జి వద్ద మరో మోటారు సైకిల్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో క్రీస్తురాజు రెండు కాళ్ళు విరిగిపోయి ఎముకలు బయటకు వచ్చాయి. సింధు తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్ళి పోయింది. కాళ్ళు విరిగి పోయిన తండ్రి తమ బిడ్డను కాపాడండంటూ అటుగా వెళ్తున్న వారిని దండం పెడు తూ ప్రాధేయపడ్డాడు. చూసిన వారు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్సు ఎంతసేపటికి రాకపోవడంతో ఏలూరునకు చెందిన చంద్రగిరి అంకయ్య, ఎస్.రమణలు కూలిపనులకు వెళ్ళి తిరిగి ఏలూరు వస్తూ ప్రమాద పరిస్థితిని చూసి ప్రాణాపాయస్థితిలో ఉన్న సింధును మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని దుగ్గిరాల బ్రిడ్జి వరకూ వచ్చారు. అక్కడ ఆటో కనిపించడంతో వెంటనే ఆటో ఎక్కించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. ప్రమాద సంఘట నలో రెండు కాళ్ళు విరిగి పోయి ఆర్తనాదాలతో కొట్టు మిట్టాడుతున్నాడని, అతను దెందులూరుకు చెందిన వాడని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సమాచారం అందింది. తను మంత్రి పర్యటనలో ఉన్నప్పటికీ వెం టనే తన అనుచరులను పంపించి ప్రైవేటు అంబులెన్సులో క్షతగాత్రును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

108 పై ప్రజల ఆగ్రహం

రోడ్డు ప్రమాదంపై 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చి 40 నిముషాలు అయినా వాహనం రాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పోస్టల్‌కాలనీకి చెందిన వాకా మీనా కుమారి (62) సోమవారం పోస్టల్ కాలనీ సమీపంలో రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైంది. 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేశారు.

లాడ్జిపై దాడి

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం రెండవ పట్టణంలో శ్రీనిధి లాడ్జిపై టూటౌన్ సీఐ కాళీచరణ్ సిబ్బందితో సోమవారం దాడి చేశారు. లాడ్జిలో 9 మంది యువకులు, 9 మంది యువతులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చి స్టేషన్‌కు రప్పిస్తున్నట్లుగా తెలిసింది. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేస్తున్నారు. పట్టుబడిన యువకులు, యువతులు విద్యార్థులుగా సమాచారం.

పార్కు చేసిన మోటార్ సైకిళ్లే టార్గెట్

ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు.. రూ.13.40 లక్షల విలువైన మోటారు బైక్‌ల స్వాధీనం


నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్కు చేసిన మోటారు సైకిళ్లను దొంగిలించుకుపోతున్న ముగ్గురు సభ్యుల అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జీడిమెట్ల, సూరారం, కూకట్‌పల్లి, పోలీస్ స్టేషన్‌లతో పాటు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్, పోడూరు, నిడదవోలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో జరిగిన బైక్ చోరీల్లో మొత్తం 11 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు సోమవారం తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, తణుకు రూరల్ సీఐ బి.కృష్ణ కుమార్‌లు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మోటారు సైకిళ్లను దొంగిస్తున్న ముఠా వివరాలను వెల్లడించారు. జీడిమెట్లకు చెందిన దాసరి మణిబాబు, తణుకు పాతూరుకు చెందిన గుడాల లక్ష్మీనారాయణ, తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామానికి చెందిన బొంత రవితేజ ఒక ముఠాగా ఏర్పడి మోటారు సైకిళ్లను అపహరించుకుపోతున్నారు. ఈక్రమంలో ఇటీవల తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు బైక్ చోరీ కేసుల్లో అనుమానాస్పదంగా వున్న లక్ష్మీనారాయణ, రవితేజలను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ మొత్తం వ్యవహారం బట్టబయలైనట్లు తెలిపారు. కేవలం బుల్లెట్ వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ రూ. 13 లక్షల 40 వేలు వుంటుందని డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబర్చిన తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్ర శేఖర్, ఏఎస్ఐ పి.సంగీతరావు, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎస్‌కే అన్వర్, ఎం.శ్రీనివాస్, వి.మధుసూద నరావు, ఎస్. భాస్కరాచారిలను డీఎస్పీ విశ్వనాథ్, సీఐ బీ కృష్ణ కుమార్ అభినందించారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు

బత్తులవారి గూడెంలో విషాధ చాయలు


శ్యాంకుమార్ (ఫైల్)

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి విహారానికి ఆనందంగా వెళ్లిన యువకుడు కృష్ణానదిలో గల్లంతైన సంఘటనతో నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో విషాధ చాయలు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే బత్తులవారిగూడెం గ్రామానికి చెందిన పావులూరి ప్రభాకర్‌రావు కుమారుడు శ్యాంకుమార్ (20) ఎన్టీయార్ జిల్లా గుంటుపల్లి రేవు వద్ద విహారానికి వెళ్ళాడు. స్నానానికి కృష్ణా నదిలో దిగగా నదిలో గల్లంతు అవడంతో అతని స్నేహితులు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఉదయం శ్యాంకుమార్ మృతదేహాన్ని వెలికి తీసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి.

కలప ట్రాక్టర్ సీజ్



టి.నర్సాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం అడవిలో నుంచి కలపను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు సీజ్ చేసిన సంఘటన మర్రిగూడెం పంచాయతీ గట్టుగూడెం సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల మేరకు గట్టుగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవి కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారంతో అధికారులు దాడి చేసి కలప ఉన్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని మక్కినవారిగూడెం బీట్‌గార్డు చలం తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వన్‌టౌన్ ఎస్ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన రాత్రి 11.30 గంటల సమయంలో చినపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద దాగరపు రాజుపై ఇద్దరు దాడికి పాల్పడ్డారు. దీంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు అనంతరం కొత్తపల్లి విక్టర్‌బాబు, నేతల క్రాంతి (బెన్ని) అనే ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేశారు. సెకండ్ ఏజెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా వారిద్దరికి న్యాయ అధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ఒకరికి రిమాండ్

గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన ఉండ్రాజవరపు హేమంత్ శామ్యూల్ అనే వ్యక్తిపై కొత్తపల్లి మహేష్ దౌర్జన్యం చేసి డబ్బు, ఫోను లాక్కున్నాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదయ్యింది. సోమవారం కొత్తపల్లి మహేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్‌వివివిఎస్ కృష్ణాజీ తెలిపారు. సెకండ్ ఏజెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నేడు చిన్నపిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం మంగళవారం సాయంత్రం 5 గంటలకు మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు ఇందుకూరి ప్రసాదరాజు ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ వైద్య పరీక్షలు చేస్తారని, శస్త్ర చికిత్సలు ఉచితంగా తమ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు, రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి మంగళవారం ప్రసూతి, గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ కె. గాయత్రి విచ్చేస్తారని, బుధవారం జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ విచ్చేస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. అవసరమైన వారికి ఆల్ట్రాసౌండ్, కాన్సర్ నిర్ధారణ, ఈసీజీ, అన్ని రకాల రక్త పరీక్షలు, ఉచితంగా చేస్తారని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు డీఆర్‌జీలో జాబ్‌మేళా

పెంటపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకూ అర్హత కల్గిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్సు కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

పాలకొల్లు ఛాంబర్స్‌లో..

పాలకొల్లు అర్బన్: స్థానిక ఛాంబర్స్ కళాశాలలో ఈ నెల 23న ఎంఎస్ఎన్ ల్యాబ్‌లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 99120 46234, 94935 03441 ఫోన్లలో సంప్రదించాలని తెలిపారు.

టీడీపీ కుటుంబాలకు ఆర్థిక భరోసా



భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఇటీవల చెట్టుకూలిన ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త గొల్ల కృష్ణంరాజు కుటుంబానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి రూ. 5 లక్షలను సోమవారం అందించారు. భీమవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త ఎవరైన ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తణుకు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమ వారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టేవరకు వెయ్యి రోజుల ప్రణాళికతో అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత సవాళ్ళను అధిగమించాలి..

యువత సవాళ్ళను అధిగమించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు. సోమవారం పట్టణ ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో ఇంటర్ ఫలితాల్లో టాపర్లకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధారంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు ఉద్యోగాలు కల్పనకు కృషి చేస్తున్నారని వివరించారు.

వీల్‌చైర్, ల్యాప్‌టాప్ వితరణ

తణుకు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి చెప్పారు. సోమవారం సంఘ కార్యాలయంలో ర్యాలి హర్షిణి అనే విద్యార్థినికి సభ్యుడు అక్కిన బాపినీడు ఆర్థిక సాయంతో రూ. 25 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను, డాక్టర్ కేవీ రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ అమెరికా సంస్థ ఆర్థిక సాయంతో రూ. 5 వేల విలువ గల వీల్ చైర్‌ను దివ్యాంగుడు అబ్దుల్ గఫూర్‌కు అందజేశారు.

కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

పెంటపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి ఎ.నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంఘ నాయకులు సోమవారం భీమవరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు దేవరాజు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రమణకు లయన్స్ క్లబ్ అవార్డు



పెనుగొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బీవీ రమణకు పాలకొల్లు లయన్స్ క్లబ్ అత్యుత్తమ సేవా అవార్డుతో సత్కరించారు. రమణ ములపర్రులో తన సొంత నిధులతో బీవీ రమణ చారిటబుల్ ట్రస్టును స్థాపించి కరోనా సమయంలో చుట్టుపక్కల పది గ్రామాలకు రెండు నెలలు పాటు ఆహారం అందించారు. పది లక్షల రూపాయలు సొంత నిధులతో కైలాస రథం, ఫ్రీజర్ బాక్స్ ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందుబాటులో ఉంచారు. కాకిలేరు గ్రామానికి చెందిన ముత్యాల హిమబిందు ఉన్నత చదువు నిమిత్తం రూ. 30 వేలు ఆర్థిక సాయం చేశారు.

సివిల్ సర్వెంట్ల సేవలు ఎనలేనివి

భీమవరం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వెంట్ల సేవలు ఎనలేనివని భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. యూత్ హాస్టల్స్ స్టేట్ సెక్రటరీ ఎం. సత్యనారాయణ, చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్, పద్మనాభుని కృష్ణ మోహన్, డి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్‌ల ఛాంబర్ మండలాధ్యక్షుడు, ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు పేర్కొన్నారు. ఆరుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి టి. రవిచంద్ర, ఎంఆర్సీ ఎం. రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు అర్జీలిలా..

మొగల్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. శేరేపాలెంకు చెందిన దూసనపూడి ఏడుకొండలు తన భార్య నాగలక్ష్మి భూమి మరొకరి పేరున ఆన్‌లైన్‌లో మారిందని సిబ్బంది మూడు సార్లు సర్వే చేసినా సమస్య పరిష్కారం కాలేదని అర్జీ ఇచ్చారు. మరో ఇద్దరు తమ స్థలాలు వివాదంలో ఉన్నాయని వినతి పత్రం అందించారన్నారు.

పెనుమంట్ర: తమ భూమికి సాగు నీరు అందడం లేదని తహసీల్దార్ వై రవికుమార్‌కు నెలమూరు గ్రామానికి చెందిన గొట్టుముక్కల సత్యనారాయణ రాజు సోమవారం అర్జీ ఇచ్చారు. తొమ్మిది సంవత్సరాలుగా తన సర్వే నెంబర్లలో భూమికి సాగు నీరు రావడం లేదన్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులను పంపాలని కోరారు.

కూలీలకు బకాయిలు చెల్లించాలని ధర్నా

నరసాపురం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలంటూ సోమవారం సరిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 3 నెలల నుంచి బకాయిలు పెండింగ్ ఉండటం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కవురు పెద్దిరాజు, జి నాగేశ్వరరావు, సువర్ణరాజు, రాంబాబు, ఝాన్సీ, శాంతకుమారిలు పాల్గొన్నారు.

బలహీనంగా గట్లు.. రోడ్లపైకే నీరు!

భుజబలరాయుడి మంచినీటి చెరువు గట్టు పరిస్థితి ఇది



వృధాగా బయటకు పోతున్న తాగునీరు

ఆకివీడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భుజబలరాయుడు మంచినీటి చెరువు గట్లు బలహీనంగా ఉండడంతో ఇంజన్లతో తోడి నింపుతున్న నీరు బయటకుపోతోంది. ఏటా వేసవికి ముందు కాలువలు బంద్ చేసే వరకూ మంచినీటి చెరువులు నింపుతుంటారు. అయితే చెరువులు లోతు తక్కువగా ఉండడం, గట్లు బలహీనంగా మారడంతో నీరు బయటకు వెళ్ళి పరిసర ప్రాంతాలు బురదగా మారుతున్నాయి. ఆ బురద నీటి నుంచే ప్రజలు, విద్యార్థులు నడిచి వెళ్ళలేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడేళ్ళ క్రితం ఈ చెరువుకు మట్టి పూడికతీతకు నిధులు మంజూరైనా పనులు నిర్వహించలేదు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా చర్యలు చేపడతామన్నారు.

29 నుంచి ఉచిత వేసవి శిక్షణ

భీమవరం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు భీమవరంలో నాలుగు ప్రాంతాల్లో బాల బాలికలకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. శిక్షణ తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సంతోషి మాత కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నాచు శ్రీవల్లి మాట్లాడుతూ నెల రోజులపాటు మహిళలకు కుట్టు మిషన్, మిషన్ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, సంగీతం, వేదిక్, అబాకస్, కరాటే తదితర వాటిపై ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నాచు వారి సెంటర్, బ్యాంక్ కాలనీ, నరసయ్య అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీలో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 96769 72227నెంబరును సంప్రదించాలని అన్నారు. అడబాల స్వర్ణ, నులి హారిక, సుంకర సుబ్బలక్ష్మి, వేముల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిరం హైస్కూల్లో వసుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ఏరియా కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 7వ తేదీ వరకూ శిక్షణా తరగతులు ఉదయం 8.30 నుంచి 10.30 వరకూ ఉంటాయని తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీలోని వీవర్స్ కమ్యూనిటీ హాల్లో టీవీ మెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో 120 మంది మెకానిక్‌లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టీవీ మెకానిక్‌లు ఎక్కువగా కంటి చూపుతో అధిక శ్రమ పడతారని, వారికి కంటి వైద్య పరీక్షలు, అలాగే బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించామని, అవసరమైతే ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తామని తెలిపారు. కార్యదర్శి నల్లా శివ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడిదాన వరప్రసాద్, ఉపాధ్యక్షుడు రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పేద యువతి వివాహానికి మానవత చేయూత

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యువతి వివాహానికి ఆర్థిక సహాయం చేయగలగటం ఆనందంగా ఉందని మానవత కన్వీనర్ ముత్యాల రామారావు అన్నారు. భూపయ్యచెర్వుకు చెందిన పేద యువతి వివాహానికి మానవత తరపున సోమవారం రూ.16,250లు నగదు, నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా మానవత సభ్యులు, దాతలకు జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, రోటరీ ప్రెసిడెంట్ రావాడ సతీష్, ట్రెజరర్ పి. సత్యనారాయణ, మానవత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

మొగల్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల స్థానిక ఆర్‌సీఎం చర్చిలో సంతాపం తెలిపారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అయినపర్తి పీటర్ ఆధ్వర్యంలో ఫ్రాన్సిస్ చిత్రపటానికి క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

ఉండి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడం అభినందనీయమని పాస్టరు బి.ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం ఉండి పెదపేటలో కమ్యూనిటీ హాలుని ప్రారంభించారు. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జి, ఉప సర్పంచ్ కళ్యాణ్‌వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, జడ్పీటీసీ కనకదుర్గ మహంకాళి, ఉండి మాజీ సర్పంచ్ ముదునూరి విజయ, ఉండి నీటిసంఘం అధ్యక్షుడు మంతెన సాయి లచ్చిరాజు, ప్యారిస్ పాస్టరు ప్రసన్న, పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంతో రైతులకు మేలు : నిమ్మల



గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

పోడూరు/పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు మండలంలోని జిన్నూరు, వేడంగిలో, పాలకొల్లు రూరల్ మండలంలోని ఉల్లంపర్రులో పంటకాల్వల వెంబడి రహదారుల్లో రూ. 1.15 కోట్లతో చేపట్టనున్న గ్రావెల్ రోడ్లకు రామసీత కాల్వలో తూడు తొలగింపు పనులకు, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మంత్రి కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడుతూ వైసీపీ రైతులను మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం పంటలకు పూర్తి రక్షణ కల్పించడమే గాక ఇష్టమొచ్చిన మిల్లుకు తోలుకుని విక్రయించేందుకు రైతులకు స్వేచ్ఛ కల్పించిందన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, పాలకొల్లు డీసీ వైస్ ఛైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కపర్ధి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పద్మారావు, పాలకొల్లు ఏఎంసీ వైస్ ఛైర్మన్ దాసరి రత్నరాజు, సర్పంచులు జమ్ము మహాలక్ష్మి, చెల్లబోయిన శారద, ఎంపీటీసీ భూపతిరాజు సరస్వతీ సత్యనారాయణరాజు, మాజీ సర్పంచ్ పాలవ లస తులసీరావు, నీటి సంఘాల ఛైర్మన్లు దేవరపు దొరబాబు, కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు భేష్ : ఎస్పీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత సేవా సంస్థ సేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ, ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ సంస్థ సభ్యుల సహకారంతో చలివేంద్రంలో వేసవి చివరి వరకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తామని తెలిపారు. భీమవరం డీఎస్పీ జయసూర్య, వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ట్రాఫిక్ సిఐలు నాగరాజు, కాళీచరణ్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, మానవత సంస్థ కో-ఛైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు) తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల ఆందోళన

పెనుగొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అతి తక్కువ వేతనంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, పాఠశాల ఆయాలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, పాఠశాలల ఆయాలు పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాసే లేబర్ కోడ్స్ తీసుకువచ్చాయన్నారు. రానున్న కాలంలో ఐక్య పోరాటాలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయు నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు



కుట్టు మిషన్లు, సైకిళ్లు అందుకున్న వారితో కాకర్ల

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకర్ల వేణుబాబు అధికార పర్యటనలో భాగంగా పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు ఆదివారం విచ్చేసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్షీరారామంలో షుగర్ పరీక్షా శిబిరం, బ్రాహ్మణులకు బియ్యం, కళ్ళజోళ్ళు అందించారు. ఆలయాల్లో సిమెంటు బల్లలు ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 75 మంది రోగులకు పాలు, రొట్టెలు అందించారు. మహిళలకు చీరలు, గొడుగులు అందజేశారు. దుర్గమ్మ ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇంకా రక్తదాన శిబిరం, లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ హాల్లో 50 మందికి సీమంతాలు, 42 మంది విద్యార్థినులకు సైకిళ్ళు, 23 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అలాగే ఐదుగురికి గ్రైండర్లు, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, 5 పాఠశాలలకు మెడికల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా వేణుబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జయభారత రెడ్డి అధ్యక్షత వహించారు. ఎలక్ట్ గవర్నర్ పాపారావు నాయుడు, పాస్ట్ గవర్నర్ డాక్టర్ బాబ్జీ, సీనియర్ సభ్యుడు నందుల సీతారామారావు, రీజనల్ ఛైర్మన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



25 మందికి దుస్తుల వితరణ

ఆచంట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆచంట కల్వరి గాస్పెల్ హీలింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో 25 మందికి ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆచంట అరుంధతీ పేట రక్షణ సైన్యం చర్చికి చెందిన దివ్యాంగులు, వితంతువులకు దుస్తులు అందజేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు చదలవాడ పాల్ తెలిపారు. ట్రస్టు సభ్యులు శాంతి పాల్, జోసఫ్ కిషోర్, చదలవాడ జాకబ్‌రాజు, కృష్ణవేణి, విజయశాంతి చదలవాడ సన్ని పాల్గొన్నారు.



భూ రక్షణకు మొక్కలు నాటాలి

కాళ్ళ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించి భూమిని కాపాడేందుకు చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఉన్నత భారత్ అభియాన్ కాళ్ళకూరు కో-ఆర్డినేటర్ జి.సూరిబాబు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో కాళ్ళకూరు యూపీ స్కూల్ ఆవరణలో సోమవారం విద్యార్థులకు ధరిత్రి దినోత్సవంపై వివరించారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

పాలకోడేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరులో పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం సంబంధిత ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహించారు. గర్భిణులు, బాలింతలందరికీ రోజూవారీ ఆహారంలో భాగంగా తాజా కూరగాయలు, స్వచ్ఛమైన పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి, స్థానిక ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ ర్యాంకర్‌కు అభినందన

మొగల్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫస్టియర్‌లో సీఈసీ గ్రూప్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన కేపీ పాలెం జడ్పీ జూనియర్ కళాశాల విద్యార్థిని గుండాబత్తుల శ్వేతను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈమె సీఈసీ గ్రూప్‌లో 500లకు గానూ 464 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించింది. సోమవారం ఆ విద్యార్థిని ఇంటికి ప్రిన్సిపాల్ జేవీ నర్సింహమూర్తి, అధ్యాపకులు వెళ్లి అభినందించారు.

నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోపాలన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇళ్ళు కోల్పోయిన బాధితులను కలిసి వారి సమస్యల్ని తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారన్నారు.



చల్లాలమ్మ ప్రతిష్ఠోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొమ్ముగూడెం గ్రామదేవత చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. 23న విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం కలశ స్థాపన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలశాల వేడుక కన్నుల పండువగా సాగింది.

ఆధ్యాత్మికం

భీమవరంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భీమవరంటౌన్: భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలను సోమవారం ఉదయం 10.15 గంటలకు వైఖానస సంప్రదాయంలో ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో మట్టా నళిని మోహన్ దంపతులు పూజలు చేశారు. ఆలయ అర్చకులు పోణంగిపల్లి శ్రీనివాసచార్యులు స్వామి వార్లను పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన, హోమాలను నిర్వహించారు. అధ్యక్షుడు వెంకటరాజు మాట్లాడుతూ ఈనెల 22న కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి తిరు నక్షత్ర ఉత్సవాలు

నరసాపురం టౌన్: పట్టణంలోని కోవెల గుడిలో బుధవారం నుంచి ఎంబర్‌మన్నార్ స్వామి తిరు నక్షత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఈవో రామచంద్ర కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 4 వరకు ఆలయ ప్రాంగణంలో జరుగుతాయన్నారు.

28 నుంచి కాళ్ళలో జాతర

కాళ్ళ: కాళ్ళ గ్రామ దేవతలు మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర ఏప్రిల్ 28 నుంచి మే 3 వరకు నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం 'పందిరిరాట' ముహూర్తం రావడంతో ఆలయం వద్ద చలువ పందిళ్ళు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటర్వ్యూ..

బెట్టింగ్ నిర్వహిస్తే చర్యలు



కె. రజనీ కుమార్, పట్టణ సీఐ, పాలకొల్లు

- **పట్టణంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా?**
  జవాబు: కొన్ని ప్రాంతాల్లోనే పనిచేస్తున్నాయి. త్వరలో ఛాంబర్స్ సహకారంతో పట్టణమంతా ఏర్పాటు చేస్తాం.
- **ఐపీఎల్ సీజన్ కావడంతో బెట్టింగ్ నిర్వహించే వారిపై ఏం చర్యలు తీసుకున్నారు?**
  జవాబు: ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్నాం. యువత బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని ప్రచారం చేస్తున్నాం.
- **పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల వద్ద ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి? మీ చర్యలు ఏమిటి?**
  జవాబు: పట్టణ పరిధిలోని అన్ని విద్యాసంస్థల వద్ద శక్తి టీంలు ఏర్పాటు చేశాం. ఆకతాయిలను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులకు తెలిపి అవగాహన కల్పిస్తున్నాం. వినకపోతే కేసులు నమోదు చేస్తాం.
- **పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టిన చర్యలు?**
  జవాబు: బారికేడ్లు ఏర్పాటు చేశాం. అతిక్రమించిన వారిపై చలానాలు విధిస్తున్నాం. 80 శాతం ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టగలిగాం.

(ఆంధ్రజ్యోతి-పాలకొల్లు టౌన్)

కార్పొరేట్ విద్యాసంస్థల్లో సీట్లు కేటాయించాలి

తణుకు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్ట ప్రకారం వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎన్‌వీటీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు.

బీచ్‌లో భద్రతా చర్యలేవీ?

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్ వద్ద భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో రెస్క్యూ టీంని గానీ, లైఫ్ సేవింగ్ బోట్స్‌ని గానీ ఉంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే వీటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కుల వివక్ష చూపిన వారిపై చర్యలు చేపట్టాలి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళితులపై గ్రామ బహిష్కరణ చేస్తే శాంతి కమిటీ వేసి పరిష్కరించామని ఆర్డీవో ప్రకటించడం అన్యాయమని, కులవివక్ష చూపిన పెద్దలను తక్షణం అరెస్టు చెయాలనీ కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతి బాబు డిమాండ్ చేశారు. సాంఘిక బహిష్కరణ జరిగినట్లు పక్కా ఆధారాలుంటే అధికారులు మాత్రం కేవలం శాంతి కమిటీ పేరుతో పరిష్కారం అయిందని చెప్పడం విడ్డూరమన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు దర్యాప్తు చేసి కుల వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలనీలో కుళాయిలు వేయాలి

కాళ్ళ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు గ్రామంలోని ప్రభుత్వ కాలనీలో కుళాయిలు వేసి తాగునీరు అందించాలంటూ కాలనీ వాసులు ఎంపీడీవో స్వాతికి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కాలనీలో ఇళ్ల నిర్మించుకోవాలని అధికారులు ఒత్తిడి చేశారని, తీరా ఇళ్ళు కట్టుకున్నాక రోడ్డు, కరెంట్, కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.